# తొలిప్రేమలో బలముందిలే...



"**అయితే మీ గర్ల్‌ఫ్రెండ్** నిర్మల ఈ శనివారానికేగా డిన్నర్‌కి వచ్చేది...?" అడిగింది మాలతి భర్త రవిని.

"కొంపదీసి ఆవిడ ముందు గర్ల్‌ఫ్రెండ్ అన్నావు గనక. నేను నీతో ఫ్రాంక్‌గా చెప్పానుగా. ఆవిడంటే నేను పడి చచ్చేవాణ్ని గానీ, ఆవిడ నన్నొక ఫ్రెండ్‌గానే చూసేదని. క్లాస్‌మేట్స్‌మి కదా, ఇన్నాళ్ల తర్వాత కనబడ్డాం. డిన్నర్‌కి రమ్మన్నాను. అంతే. నువ్వు లేనిపోనివి పుట్టించకు, పుణ్యముంటుంది." అన్నాడు

రవి కంగారు పడుతూ.

"అబ్బ, పెళ్ళయి ఏడాది కావొస్తున్నా ఇంకా నా సంగతి మీకు అర్థం కాలేదు కదా. ఊరికే టీజ్ చేస్తేనే మీ కంత ఖంగారెందుకు? ఇలా అయితే అనుమానించేస్తానంతే! హిప్రాకసీ లేకుండా మాట్లాడ్డమే మీలో నాకు బాగా నచ్చే లక్షణం. డిన్నర్ కేం చెయ్యాలని అడుగుదామంటే మీరేమో.."

"నేను కాంప్‌నుంచి శుక్రవారం వచ్చేస్తానుగా. ఆవిడ కాన్ఫరెన్స్ కూడా శనివారం మధ్యాహ్నం దాకా ఉంది. శుక్రవారం సాయంత్రం వెళ్ళి కావలసినవి కొందాం. అవునూ, నీ కివాళ మీ క్లాసుమేటు మారేజీ రిసెప్షన్ ఉంది కదా, స్టేషనుకి ఆటోలో వెళ్ళేటప్పుడు నిన్నక్కడ దింపేసి వెళ్ళనా?"

రిసెప్షన్‌కి మాలతి క్లాసుమేట్స్ చాలామంది వచ్చారు. చాలామందికి పెళ్ళిళ్లయ్యేయి. భర్తలగురించి కబుర్లు రాకుండా ఉంటాయా? డిన్నర్ విషయం చెప్పగానే వసంత చివాట్లేసింది – "తన ప్రేమ ఒన్‌సైడెడ్ అని రవి చెప్పారే అనుకో. నిర్మల కిలాటి అభిప్రాయం ఉండేదో లేదో నీకేం తెలుసు? మీ ఆయనకే తెలీదు. ఆవిడా మనసులో దాచుకుందేమో. ఇలా వాళ్ళు కలిసే అవకాశాలు మనంతట మనమే వాళ్ళకి కలగజేయడం ఎందుకు?"

"పోవే పిచ్చిదానా, ఒకవేళ వున్నా ఓ ఆడది అంత త్వరగా బయటపడుతుందేమిటి?" అంటూ మాలతి విదిలించేసింది.

భోజనాల దగ్గిర రెడ్డిని చూసి ఆశ్చర్యపడింది మాలతి. "మీరు బెంగుళూరులో ఉంటున్నారన్నారు?"

"నిజమే. పాత క్లాసుమేట్సందరినీ చూసినట్టుంటుందని టూరేసుకుని వచ్చేను. మిమ్మల్ని చూడడం మరీ సంతోషంగా ఉంది." అన్నాడతను.

'మొహంలో ఆ సంతోషం వెల్లివిరుస్తోంది ఆజానుబాహుడు. స్ఫురద్రూపి. రంగు తక్కువైనా కళైన మొహం. స్పోర్ట్స్‌ఛాంపియన్‌గా తనలాటి అమ్మాయిల హృదయాలను కొల్లగొట్టేడంటే కొల్లగొట్టడూ? అతనంటే తనెంత పడిచచ్చేది! తన కంటికి నచ్చిన మొదటి మగవాడితనే. కళాకాంతులన్నీ చెక్కు చెదరకుండా ఉన్నాయిప్పటికీ. ఆ రోజుల్లో రోజుకో ప్రేమలేఖ అతని పేర రాసి, ధైర్యం చాలక చింపిపారేసేదని అతనికి తెలిస్తే ఏమనుకుంటాడో!' అనుకొంది మాలతి.

"మీ వారు నాయుళ్ళా?" అన్నాడు రెడ్డి మాలతి అందించిన అడ్రసు స్లిప్ చూస్తూ.

"అవును సి.ఆర్.నాయుడు అంటే ఎవరైనా..."

"మీరు బ్రామిన్సేమో!? ఇంటర్‌కాస్ట్ మారేజా!? ప్రేమ వివాహమా!?"

"అబ్బే, కాదండి. మా పేరెంట్స్‌ది కులాంతరమే కదా. కులం పట్టింపు లేదని పేపర్లో వేయించారు. అది చూసి ఈయన రెస్పాన్స్ ఇచ్చారు...."

రెడ్డి వినడం లేదు. మొహమంతా వివర్ణమయిపోయింది. ఏదో గొణుక్కుంటున్నాడు. 'ఛ,ఛ' అనుకున్నాడు. కాస్సేపటికి తలెత్తి తనకేసి చూసేసరికి కళ్ళలో లీలగా కన్నీళ్ళు. "చూడండి, వాటే ఫూల్ ఐ యామ్? సరిగ్గా కనుక్కోనేలేదు. ఏదేదో ఊహించుకొని, భయపడి. ఛ.." అని మళ్ళీ తల విదిల్చేడు. మాలతికి ఏమనాలో తెలియలేదు. భర్త గురించి ఏదేదో మాట్లాడసాగింది. అదృష్టవశాత్తూ ఎవరో వచ్చి రెడ్డిని పలకరించి తమతో తీసుకెళ్ళారు.

ఆ రాత్రి వెళ్ళిపోయేటప్పుడు రెడ్డి మాలతి దగ్గరికి మళ్ళీ వచ్చేడు. "రేపు పన్నెండుగంటల బస్సుకు వెళుతున్నాను. మీకు వీలైతే బస్‌డిపోకి వస్తారా? కాస్సేపు మాట్లాడుకోవచ్చు." అన్నాడు. సరేనంది మాలతి.

మర్నాడు పన్నెండు గంటల బస్సు కాన్సిలయింది. గంటన్నర తర్వాతనే మరో బస్‌ట. బాగ్ క్లోక్‌రూమ్‌లో పడేసి, "అంతసేపూ ఏం చేద్దాం. హోటల్లో కూచోడం బోరు." అన్నాడతను.

"దగ్గర్లో మునిసిపల్ స్టేడియం ఉంది. వెళదామా, ఫర్ ఓల్డ్‌టైమ్స్ సేక్" అంది మాలతి.

స్టేడియం నిర్మానుష్యంగా కనబడింది. పనివాళ్ళు ఏ మూలో జోగుతున్నారులా ఉంది. గ్రౌండ్‌లోకి రాగానే "రన్నింగ్‌రేస్ చేద్దామా?" అన్నాడు రెడ్డి హుషారుగా. "నేను వేసుకున్నది చీర, ట్రాక్‌సూట్

కాదు. అయినా మీతో రేసా, బాబోయ్!" అంది మాలతి. "నేనూ ఈ మధ్య ప్రాక్టీసు చేయటం లేదు. పోనీ మీరు సగం దూరం ముందు వెళ్ళి నుంచోండి" అన్నాడు రెడ్డి.

పరిగెడుతూంటే చీర కాళ్ళకడ్డం పడి తూలబోయింది మాలతి. అతను వచ్చి చటుక్కున పట్టుకున్నాడు. "కాలు బెణికినట్టుంది" అందామె. సునాయాసంగా రెండు చేతులా ఆమెను గాలిలోకి ఎత్తేస్తాడు. ఎత్తి, గాలరీ సిమెంటు బెంచీల మీద పడుక్కోబెట్టాడు. మాలతి కిలకిలలాడింది-రెడ్డి తన్ను అలా తీసుకురావడంతో. రెడ్డి కూడా నవ్వేడు, పకపకా. ఎందుకో అతనికీ తెలీదు. మోసుకురావడం వల్లా, నవ్వడం వల్లా అలుపు వచ్చినట్టుగా ఉంది. ఆమెను పడుక్కోబెట్టిన బెంచీ కింద బెంచీలోనే తనూ పడుక్కొని అలుపు తీర్చుకోసాగేడు.

మాలతి లేచింది; శ్రీమహావిష్ణువులా చేతికి తల ఆన్చి అతనికేసి సాలోచనగా చూసింది. ఒగరుస్తూండడం వల్ల అతని ఛాతీ ఎగిరి ఎగిరి పడుతోంది. అప్రయత్నంగానే ఆమె చేయి ముందుకు సాగింది, అతని ఛాతీ నిమరాలని. కానీ అంతలోనే అతడు "నీ వెనక్కాల పురుగేదో పాకుతున్నట్టుంది, చూసుకో" అన్నాడు.ఆమె ఖంగారుపడి కింది మెట్టుపైనున్న అతనిపైకి దొర్లింది. అతను బాలన్స్ కాచుకోడానికో ఏమో, చేతులతో ఆమెను చుట్టివేసాడు. ఆ స్థితిలో నుండి బయటపడాలనిపించలేదు మాలతికి. కానీ కింద బెంచీమీద నుండి కుక్క ఒకటి పోతూ భౌయ్ మంది. కౌగిలి విదిలించుకొని ఆమె తన మెట్టుపైకి దొర్లింది.

రెడ్డి మౌనంగా, ఆర్ద్రంగా అమె కేసి చూస్తున్నాడు.

"ఆడవాళ్ళు, అవకాశం సృష్టించుకున్న మగవాళ్ళనైనా క్షమిస్తారు కానీ దాన్ని జారవిడుచుకున్నవాళ్ళని క్షమించరట, విన్నావా." అంది మాలతి అతని కేసి చూసి నవ్వుతూ. అన్నది కానీ అతని కళ్ళలో నీళ్ళు చూసి ఎందుకన్నానా అని బాధపడింది.

"నన్ను నేనూ క్షమించుకోను, ధైర్యం చేయనందుకు" అన్నాడు రెడ్డి.

ఆమె అతని కన్నులు తుడిచింది. అతనామె చేతిని అలాగే తన పెదాలదాకా తెచ్చి ముద్దాడి వదిలేసాడు. "ఇంకాస్సేపుంటే డేంజరు, వెళ్ళిపోదాం రా." అన్నాడు.

ఆ రాత్రే మాలతి పరిస్థితి సమీక్షించుకుంది.ఇంటర్‌కాస్ట్‌కు ఒప్పుకోదన్న భయంతోనే రెడ్డి తనపై ప్రేమను మనసులో దాచుకున్నాడని స్పష్టమైంది. అది తలచుకుంటేనే తన ఒళ్ళు ఎంత పులకరిస్తోందో! భర్త వద్ద కూడా అలాటి అనుభూతి ఎన్నడూ కలగలేదు. 'తొలిప్రేమలో బలముందిలే' అన్న కవి మాటల్లో ఎంత నిజముందో తెలుస్తోంది. మళ్ళీసారి వచ్చినప్పుడు కలుద్దామని అతనంటే సరేనంది తను.

కానీ.... తన మానసిక స్థితి ఇలా ఉన్నప్పుడు అది మంచిదేనా? ఈ సారి చూపించిన నిగ్రహం వచ్చేసారి చూపలేకపోతే? ఇది దేనికి దారితీస్తుందో.....? ఇంతటితో స్వస్తి చెప్తే సరి. మరి రవి ఫ్రెండ్ నిర్మల సంగతి కూడా రెడ్డి లాటిదేనా? ఆమె కూడా రవిని కలిసినప్పుడు బయట పడితే? తొలిప్రేమ బలం తనకు తెలిసివచ్చిందగా. భర్తా, నిర్మలా కూడా తనలాటి వాళ్ళు కారూ? వాళ్ల నిగ్రహం తనకంటే తక్కువేమో!? ఎందుకొచ్చిన గొడవ? ఆదిలోనే తుంచేస్తే సరి. నిర్మలను డిన్నర్‌కి పిలవడానికి వీల్లేదని గట్టిగా చెప్పేస్తే సరి.'

ఆ నిర్ణయం తీసుకున్నాక మాలతికి నిద్ర పట్టింది.

(ఆంధ్రజ్యోతి వీక్లీ అక్టోబరు 1998)